క్లుప్తంగా

పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ



పెడన: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ సందర్భంగా నిర్వహించిన షార్ట్ వీడియో పోటీలలో పెడనలోని భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు, గైడ్ టీచరు కె.లక్ష్మీదేవికి రాష్ట్రస్థాయిలో కన్సొలేషన్ బహుమతి లభించింది. విజయవాడ తాజ్ వివాంతా హోటల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఏఎస్ విజయానంద్ చేతుల మీదుగా ఈ బహుమతి అందుకున్నారు. గైడ్ టీచర్‌తో లక్ష్మీదేవితో పాటు విద్యార్థులు పేరిశెట్టి రుత్విక్ నాగచందు శ్యామ్ సాయి, చిలకల నాగ వెంకట సాయి విఘ్నేష్, కట్టకోట నాగ వినయ్, లుక్కా విష్ణువర్ధన్, నాగవెంకట పైడి గోపాల్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, డీవైఈవోలు బి.శేఖర్‌సింగ్, ఐ.పద్మారాణి, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్ అహ్మద్ అభినందించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

కె కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం దళితవాడలో పీస్ గాస్పెల్ మిని స్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నిర్వాహకులు బిషప్ బుర్రే శాంసన్, ప్రభుకుమారి దంపతులు భారీ కేక్ కట్ చేసి విశ్వాసులకు క్రీస్తు సందేశం అందించారు. సుమధుర గానాలతో క్రీస్తు గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా బీటెక్ విద్య అభ్యసిస్తున్న కొక్కిలిగడ్డ మణిరత్నంకు ఖరీదైన ల్యాప్‌టాప్‌ను అందించారు. అనంతరం 100 మంది మహిళలకు చీరలు, 70 మంది దైవసేవకులకు నూతన వస్త్రాలు అందజేశారు.

చిరుధాన్యాలతో రక్తహీనత నివారణ

తాడేపల్లి(ఘంటసాల): చిరు ధాన్యాలు తీసుకోవడం ద్వారా రక్తహీనత తగ్గించుకోవచ్చునని కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి తెలిపారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామం అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళలు, కిశోర బాలికలకు చిరు ధాన్యాల వలన కలిగే ప్రయోజనాల గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడే మహిళలు, కిశోర బాలికలకు చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ ఆధారిత న్యూట్రీ బార్‌ల గురించి వాటిలో లభించే పోషక విలువల గురించి వాటిని తయారు చేసే విధానాన్ని వివరించారు. తయారు చేసిన చిరు ధాన్యాల పోషక ఆహార పదార్థాలను అందరితో తినిపించి వాటి రుచి, బాగున్నాయో లేదో వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబంలో చిరు ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాల వల్ల ఆరోగ్యం బాగుంటుందని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి, మహిళలు, వ్యవసాయ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఝాన్సీసాబూకు సావిత్రీ బాయి పూలే పురస్కారం

బంటుమిల్లి: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీసాబూ సావిత్రిబాయి పూలే జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఏర్పాటు చేసి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది, విద్యా ప్రమాణాలు పెంచడంలో కృషి చేసిన సందర్భంగా ఝాన్సీసాబూను సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్‌పీఎల్‌టీఓ) ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును జనవరి 3న జరిగే జాతీయ మహిళా దినోత్సవం రోజు అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అవార్డుకు ఎంపికైన ఝాన్సీసాబూకు పాఠశాల డైరెక్టరు సాబూజాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

కనుమరుగవుతున్న చరిత్ర ఆనవాళ్లు

- బ్రిటిష్ కాలం నాటి గుర్రపుశాల
- నాటి బాటసారి సత్రం
- ప్రకాశం బ్యారేజీ సమయంలో నిర్మించిన లాకులు

కృత్తివెన్ను: నేటి తరం వారికి ఆనాటి స్మృతులను తెలియజేసేవి నాటి చరిత్రను నేటికీ చేరవేసే సాక్ష్యాలు అప్పటి కట్టడాలు, నిర్మాణాలు. స్వాతంత్ర్యం రాక పూర్వం బ్రిటీష్ వారి పాలనలోని కొన్ని ఆనవాళ్లు నేటికీ చెక్కు చెదరకుండా చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం అవి శిథిలమై చరిత్ర ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో బ్రిటీష్ వారి సంచారానికి గుర్తుగా లక్ష్మీపురంలోని గుర్రపుశాల నిలుస్తోంది. సుమారు వంద సంవత్సరాలకు పూర్వం బ్రిటీష్ పాలకులు ఈ ప్రాంతానికి ఎక్కువగా వచ్చేవారని ఇక్కడి వారు చెప్పుకుంటారు. దీనికి ప్రధాన కారణం విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రారంభమైన ప్రధాన పంటకాలువ ప్రస్థానం లక్ష్మీపురం వద్ద గల ఉప్పుటేరులో కలువడంతో ముగుస్తుంది. దీంతో అప్పట్లో బ్రిటీష్ అధికారులు కాలువ వెంబడి పరిశీలనార్థం ఇక్కడ వరకు వచ్చేవారు. చివరి మజిలీ కావడంతో తమతో పాటు తమ అశ్వాలు సేద తీరేందుకు ఇక్కడే 1895వ సంవత్సరంలో ఇరిగేషన్ బంగ్లా, గుర్రపుశాల నిర్మించారు. గుర్రపుశాల ఇప్పటికీ చెక్కుచెదరకుండా అలాగే దర్శనమిస్తోంది. ఇరిగేషన్ బంగ్లా సైతం మధ్యలో చిన్నపాటి మరమ్మతులు మినహా నేటికీ వినియోగంలోనే ఉంది. మారుమూల తీరప్రాంతమైనప్పటికీ బ్రిటీష్ కాలం నుంచే పరిపాలనా వ్యవహారాలలో ఈ ప్రాంతం పాలుపంచుకుందనడానికి ఇవే ప్రత్యక్ష సాక్ష్యాలు.



లక్ష్మీపురంలోని బ్రిటీష్‌వారి కాలం నాటి గుర్రపుశాల



ఆనాడు బ్రిటీష్ అధికారులు సేద తీరిన ఇరిగేషన్ బంగ్లా



పెదగొల్లపాలెంలో శిథిలమవుతున్న బాటసారి సత్రం

నాటి బాటసారుల సేద తీర్చిన సత్రం...

బ్రిటీషు వారి సమయంలో తీరం వెంబడి కాలినడకన ప్రయాణాలు సాగించే బాటసారుల కోసం అక్కడక్కడ బాటసారి సత్రాలను నిర్మించారు. కృత్తివెన్ను మండలం పెదగొల్లపాలెంలోని ఈ బాటసారి సత్రం ఎన్నో ఏళ్ల పాటు ప్రజలకు సేద తీర్చి నేడు శిథిలావస్థకు చేరింది. చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఇటువంటి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటితరం వారిపై ఉంది. ఇప్పటికైనా వీటిని గుర్తించి మరమ్మతులు చేసి అప్పటి చరిత్రకు సాక్ష్యాలను భద్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

చేపలతో సమోసాలు, పకోడి, కట్‌లెట్‌ల తయారీ

విలువాధారిత మత్స్య ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ



చేపలతో సమోసాలు, పకోడి తయారీపై శిక్షణ ఇస్తున్న మత్స్య శాస్త్రవేత్తలు

భావదేవరపల్లి(నాగాయలంక): ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ(హైదరాబాద్), కృషి వి/్ఞాన కేంద్రం(ఘంటసాల)ఆధ్వర్యంలో స్థానిక మండలి కృష్ణారావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులపై జరుగుతున్న రెండో రోజు శిక్షణ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ యశ్వంత్ కుమార్ నేతృత్వంలో శుక్రవారం కొనసాగింది. శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎంపిక చేసిన వివిధ వర్గాలకు చెందిన 30 మంది మహిళలకు అల్లూరి సీతారామరాజు జిల్లా పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం మత్స్యవిభాగ శాస్త్రవేత్త డాక్టర్ కె.వీరాంజనేయులు చేప సమోసా, చేప కట్‌లెట్, చేప పకోడి వంటల తయారీని నేర్పించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్ మాట్లాడుతూ తయారు చేసిన మత్స్య ఉత్పత్తుల మార్కెటింగ్ పైనే సక్సెస్ ఆధారపడి ఉంటుందని చెపుతూ మార్కెటింగ్ సంబంధిత అంశాలను మహిళలకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, అధ్యాపకులు, కేవీకే శాస్త్రవేత్తలు, శిక్షణ పొందుతున్న మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా ఇనాం భూములు మాకు ఇప్పించండి

శ్రీకాకుళం రైతుల వినతి

శ్రీకాకుళం(ఘంటసాల): ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సదస్సులో రైతులు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో గ్రామానికి చెందిన రైతులు సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) ఆధ్వర్యంలో ఇనాం భూముల సమస్య పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం రెవెన్యూ పరిధిలో సుమారు 525 ఎకరాల భూమి చల్లపల్లి జమీందారు వారి వద్ద నుంచి పర్సనల్ గ్రాంటుగా ఇనాం ఇచ్చారన్నారు. 2016లో వచ్చిన ఇనాం చట్ట సవరణ ప్రకారం ఆయా భూములు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. సదరు భూమి సర్వీసు ఇనాం కాదని, అధికారులు ఈ విషయాన్ని పరిశీలించి తమ ఇనాం భూములు తమకు ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అధికారులకు అర్జీ సమర్పించిన వారిలో కె.శ్రీనివాసరావు, ఎస్.ఉమామహేశ్వరరావు, ఎన్.అర్జునరావు, కె.అచ్చేశ్వరరావు, ఎస్.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన ద్వారానే అన్ని వర్గాలకు న్యాయం

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

ఘంటసాల: దేశ వ్యాప్తంగా కులగణన చేస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. ఘంటసాలలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందె జగదీష్ గృహం వద్ద శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అగ్రకుల పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరిట 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంటులో 103వ రాజ్యాంగ సవరణ చేసి మరీ చట్టం చేయడం రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధమని దీనిపై సుప్రీం కోర్టు 9 మంది జడ్జీలకు మించిన విస్తృత ధర్మాసనం ద్వారా విచారించేలా చర్యలు గైకొనాలని కోరారు. రిజర్వేషన్లు మొత్తం 50 శాతం మించకూడదన్న సుప్రీం కోర్టు పరిమితిని 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో మించిపోతున్నప్పుడు సుప్రీం తానిచ్చిన తీర్పును తానే అతిక్రమించినట్లు కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతురావు, అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శి ఆత్కూరి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్‌షాపుల దరఖాస్తుదారులకు పరీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్ షాపులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శనివారం పరీక్ష నిర్వహించనున్నారు. డివిజన్ పరిధిలో 46 షాపుల ఖాళీలను భర్తీ చేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్ ఆధారంగా 46 షాపుల్లో 22 ఓసీ, 3 బీసీ–ఏ, 5 బీసీ–బి, 1 బీసీ–సి, 1 బీసీ–డి, 6 ఎస్సీ, 6 ఎస్టీ రిజర్వేషన్ దామాషా ప్రకారం భర్తీ చేయనున్నారు. వీరికి మచిలీపట్నం నగరంలోని హిందూ కళాశాలలో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 46 షాపులకు గానూ 120 మంది దరఖాస్తు చేసుకోగా అర్హతలను బట్టి 68 దరఖాస్తులను స్వీకరించారు. పరీక్షలో మార్కుల ఆధారంగా అభ్యర్థులకు ఈ నెల 24న ఉదయం 11 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీవో కె.స్వాతి సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

డాక్టరేట్ అందుకున్న వార్డు సచివాలయ కార్యదర్శి

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని 35వ డివిజన్‌లో సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న తుంగల దుర్గానాగేశ్వరరావు ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. సోషల్ వర్క్ విభాగానికి సంబంధించి 'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వృద్ధులపై జరుగుతున్న హింస అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. డాక్టరేట్ పట్టా పొందిన దుర్గానాగేశ్వరరావును నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు శుక్రవారం తన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు.



దుర్గానాగేశ్వరరావును సన్మానించి అభినందిస్తున్న కమిషనర్ బాపిరాజు, సచివాలయాల కార్యదర్శులు

సర్టిఫికేట్లు పోయినవి

బందరు మండలం, కోన గ్రామస్తురాలు గంజాల శిరీష, D/o. రామకృష్ణ అను నాకు చెందిన టెన్త్ క్లాస్ (ఎస్.ఎస్.సి.) ఒరిజినల్ సర్టిఫికేట్ జిరాక్స్ తీయించుకునే నిమిత్తం మచిలీపట్నం వెళుతుండగా మార్గ మధ్యలో పోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును.
సంప్రదించండి: 6300554945

వినియోగదారుల హక్కులు, రక్షణ సంఘం చైర్మన్‌గా పశుపతి

పెడన: వరల్డ్ వైడ్ కన్స్యూమర్ రైట్స్–ప్రొటెక్షన్ పెడన చైర్మన్‌గా ఎంపికైన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు చిట్టూరి పశుపతినాథ్‌బాబును శుక్రవారం పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు అభినందించారు. స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా, ఆత్మకూరి సురేష్ కుమార్, కొల్లూరి రాజా, రాధాకృష్ణ గుప్తా, జల్లూరి రమేష్, పాదర్తి శ్రీను, జల్లూరి రంగారావు, భవిరిశెట్టి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాన్ అప్రూవల్‌పై అభ్యంతరాలుంటే తెలపండి

పెడన: పట్టణంలోని 15, 16వ వార్డులలోని జగపతి థియేటర్, ఫిష్ మార్కెట్ ప్రాంతాల్లో మున్సిపల్ ప్లాన్ అప్రూవల్ కోసం ప్లానింగ్ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న రోడ్ల విస్తరణకు సంబంధించి, భవన నిర్మాణాలకు సంబంధించి అప్రూవల్ కోసం జారీ అయిన ఈ నోటిఫికేషన్‌పై ఏమైనా అభ్యంతరాలుంటే పెడన మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా లేదా ఈ మెయిల్ ద్వారా ఏడు రోజుల్లోగా తెలియజేయాలని కోరారు.

సమన్వయంతో పనిచేయాలి

కృత్తివెన్ను: ప్రజాక్షేత్రంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా చేరాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించగా హాజరైన సర్పంచ్, ఎంపీటీసీలు వాటిని సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపుకోవాలన్నారు. దీనికి గాను రక్షిత మంచినీరు, ఇరిగేషన్ శాఖల అధికారులు బాధ్యత వహించి ప్రజాప్రతినిధులను సమాయత్తం చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణాలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మైలా రత్నకుమారి, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, శిరీష, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌కు అబ్దుల్‌కలాం విజ్ఞాన్ పురస్కారం

కోడూరు: స్థానిక రవితేజ స్కూల్ ప్రిన్సిపాల్ కొరివి అనిల్‌కుమార్‌ను గుంటూరుకు చెందిన డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్, సుగుణ సైన్స్ అకాడమీ అందించే రాష్ట్రస్థాయి ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన్ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని హిందూ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందించనున్నట్టు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

పెడన: పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం పది గంటలకు కేక్ కటింగ్, ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ తదితర కార్యక్రమాలుంటాయన్నారు. పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులంతా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

ఘంటసాల కేవీకేలో స్వచ్ఛత పక్వాడ

ఘంటసాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని కేవీకే శాస్త్రవేత్తలు అన్నారు. ఘంటసాల గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శాస్త్రవేత్తలు సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు మంజువాణి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన పైడమ్మ జాతర మహోత్సవాలు

పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారంతో ఏడో రోజుకు చేరాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానికులు శిడిబండ్లకు పసుపు రాసి వేపాకులు కటౌట్ సుందరంగా బూరలు, రంగు కాగితాలతో అలంకరించారు. బొమ్మలు పెట్టి పట్టణంలో ఊరేగుతూ నృత్యాలు చేస్తూ పసుపు జల్లుకుంటూ అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో టీవీవీ మోహనరావుతో పాటు దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసుల పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

బంటుమిల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్ పట్ల కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని, ఆయన్ను మంత్రి మండలి నుంచి తొలగించాలని సీపీఎం, కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘం, కేవీపీఎస్ నాయకులు జి.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఎల్.అజయ్‌ఘోష్, బి.నాగరాజు, పి.వెంకన్న తదతరులు పాల్గొన్నారు.

కారుణ్య మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుక

ఘంటసాల: పాపులను రక్షించడానికే ఏసుక్రీస్తు లోకంలో జన్మించారని కారుణ్య మినిస్ట్రీస్ డైరెక్టర్ సొంగా రాజేష్ అన్నారు. ఘంటసాల గోటకం కమ్యూనిటీహాలులో పాస్టర్ పి.షాలేమ్ రాజు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుక గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ముందుగా క్రైస్తవ గాయకులు డీఎస్ రాజు, విశ్వాసులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దిరిశం వెంకట్రావు, పలువురు పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు. అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల శాశ్వత పరిష్కారం

మోపిదేవి: రెవెన్యూ సదస్సుల ద్వారా భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గావాణి అన్నారు. మోపిదేవి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ నందిగామ మేరీరాణి అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గుండపనేని భవాని పేరున 88 సెంట్లు భూమి ఉండగా, అడంగల్‌లో 69 సెంట్లకు మాత్రమే పాస్‌బుక్ వచ్చిందని, మిగిలిన 19 సెంట్లకు మిలిటేషన్ కాలేదని, ఆ భూమిని కూడా అడంగల్‌లో ఎక్కించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరారు. మరో రైతు వేములపల్లి సుధాకర్‌రావు తన కుమార్తె ఆశాలత పేరున 5.32 ఎకరాల భూమికి పట్టాదారు పుస్తకం ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీవిద్య మాట్లాడుతూ పలు సమస్యలపై 8 అర్జీలు అందినట్లు వివరించారు. దేవదాయశాఖ అధికారి జోగి ప్రవీణ, ఇన్‌చార్జి ఆర్‌ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్‌ఓ బొడ్డు శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్రచివర(నాగాయలంక): రెవెన్యూ, సర్వే శాఖలలో కొత్త వినతుల స్వీకరణ, పెండింగ్ అర్జీల పరిష్కారం తదితర అంశాలపై నాగాయలంక మండలం ఏటిమొగ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండల డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రఫీ నేతృత్వంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో 13 అర్జీలు అందినట్లు గ్రామ రెవెన్యూ అధికారి కృష్ణబాబు చెప్పారు. ఎంపీడీఓ జేకే సీతారామ్‌కుమార్, కె.శ్రీనివాసరావు, సర్పంచ్, గ్రామ కార్యదర్శి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని గంగ్రం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 5 అర్జీలు వచ్చినట్టు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. సర్పంచి గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు, రిటైర్డ్ తహసీల్దారు గుడివాడ రామస్వామి, ఆర్‌ఐ టి.రాధ, మండల సర్వేయరు కె.మురళీకృష్ణ, వీఆర్వో గుడివాడ సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

కోడూరు: మండల పరిధిలోని రామకృష్ణాపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 14 సమస్యలను పరిష్కరించినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత జేఏసీ నాయకులు

మచిలీపట్నంటౌన్: కేంద్ర హోం శాఖామంత్రి అమిత్‌షా ఇటీవల రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ మాట్లాడటాన్ని నిరసిస్తూ శుక్రవారం దళిత జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దళిత జేఏసీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనంద బాబు(జానీ) మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ గంటా వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ యంత్రపాటి నాగేశ్వరరావు, దళిత జేఏసీ మండల అధ్యక్షుడు ఏలికే చైతన్య, జై భీమ్ సేన అధ్యక్షుడు బూరగ రామారావు, ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ నాయకుడు శోభన్‌కుమార్, డీబీపీఎస్ కన్వీనర్ ఎగ్గోని గాంధీ, మాజీ సర్పంచ్ దగాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోర్టురోడ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జై భీమ్ సేన వ్యవస్థాపకుడు బూరగ రామారావు క్షీరాభిషేకం చేశారు.

నేత్రదానం

అవనిగడ్డ: మండల పరిధిలోని తుంగలవారిపాలెంలో శుక్రవారం మరణించిన రేపల్లె శ్రీనివాసరావు(70) నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాల వైద్యులు వెంకటేశ్వరరావు నేత్రాల నుంచి కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.

సచివాలయంలోకి మందు బాబులు రాకుండా చర్యలు

అవనిగడ్డ: అవనిగడ్డ 1వ సచివాలయం భవనంలోకి మందుబాబులు రాకుండా సర్పంచ్ గొరుముచ్చు ఉమా, కార్యదర్శి అనిత ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకస్మిక తనిఖీలో గదుల్లోనే మద్యం తాగి సీసాలు అక్కడే పారేసిన వైనం వెలుగులోకి వచ్చింది. మందుబాబులు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించడంతో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సరిహద్దు గోడ విరిగిన ప్రాంతంలో పరదాలు అడ్డుగా పెట్టించారు. వెనుకవైపు ఉన్న గేటుని మూసివేశారు. కార్యాలయం ఆవరణలోకి రాత్రివేళల్లో ఎవరూ రాకుండా చర్యలు తీసుకున్నారు. సచివాలయ గదులు, మెట్లు, భవనంపైన, పరిసరాలన్నింటినీ సిబ్బందితో శుభ్రం చేయించారు.